గురువారం 29-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 439 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం

మిగతా 2లో



యుద్ధాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే **ఎక్కువ మరణాలు**

మిగతా 2లో



దేశంలో భారీగా పెరిగిన పిడుగుపాటు మరణాలు

మిగతా 3లో



టీచ్ ఫర్ ఇండియా 2025 ఫెలోషిప్

మిగతా 4లో

## భారత్‌లో ఏడాది పెరిగిన ఆయుర్దాయం

### కాలుష్య తీవ్రత తగ్గినట్లు నివేదికలు వెల్లడి

ముందడుగు జాతీయం:

భారత్‌లో విపరీతంగా పెరిగిపోయిన కాలుష్యం క్రమంగా తగ్గుతోంది. దేశంలో పలుచోట్ల ఇటీవల కాలుష్య తీవ్రత తగ్గినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2022లో కాలుష్య రేణువుల స్థాయి 19.3శాతం తగ్గినట్టు తాజా నివేదిక పేర్కొంది. తద్వారా దేశ పౌరుల సగటు ఆయుర్దాయం ఏడాది పెరిగినట్లు అంచనా వేసింది. అయితే, కొన్ని రాష్ట్రాల్లో కాలుష్యం తగ్గినా.. అనేక ప్రాంతాల్లో వీటి కాలుష్య ముప్ప అధికంగానే ఉందని తెలిపింది. కాలుష్య తీవ్రతకు సంబంధించి 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్-2024'ను యూనివర్సిటీ ఆఫ్ షికాగోలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ రూపొందించింది. 2021తో పోలిస్తే 2022లో భారత్‌లో పీఎం2.5 స్థాయిలు క్యుబిన్ మీటరుకు 9మైక్రోగ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లోని పలు జిల్లాల్లో కాలుష్య స్థాయిలు గణనీయంగా క్షీణించినట్లు పేర్కొంది. కాలుష్యం తగ్గినా.. భారత్‌లోని 42శాతం పౌరులు గాలి నాణ్యతా ప్రమాణాల కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని తాజా నివేదిక వెల్లడించింది.

## సీబీఐ విచారణలో న్యాయం ఇంకెప్పుడు..?

### నేను ఐదు రోజుల సమయం అడిగాను

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ



ముందడుగు పశ్చిమబెంగాల్:

తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషద్ (విద్యార్థి విభాగం) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బహిరంగ కార్యక్రమంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రసంగించారు. విచారణ కోసం నేను ఐదు రోజుల సమయం అడిగాను. కానీ కేసును సీబీఐకి అప్పగించారు. వారు న్యాయం తొందరగా అందించాలని కోరుకోవడం లేదు. సీబీఐకి కేసు అప్పగించి 16 రోజులవుతోంది. మరి న్యాయం ఎక్కడ..?'' అని ప్రశ్నించారు. తాము త్వరలో అసెంబ్లీ సమావేశానికి పిలుపునిచ్చి, రేపిస్టులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బిల్లును ప్రవేశపెడతామన్నారు. 'అత్యాచార వ్యతిరేక చట్టాలకు సంబంధించి బిల్లుల్ని ఆమోదిస్తాం. వాటి ద్వారా నేరం జరిగిన వారం రోజుల్లోనే రేపిస్టుకు మరణశిక్ష పడేలా చూస్తాం. ఆ బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపుతాం. దానికి ఆమోదం లభించకపోతే.. రాజ్‌భవన్ బయట నిరసన తెలుపుతాం. ఆ బిల్లుకు తప్పక ఆమోదం లభించాలి'' అని మమత వ్యాఖ్యానించారు. అత్యాచార ఘటనపై భాజపా కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని, రాష్ట్రాన్ని అప్రతిష్ఠ పాలుచేయాలని చూస్తోందని ఆరోపించారు.

## అత్యాచార ఘటన తీవ్రంగా కలిచివేసింది

### రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర ఆవేదన

ముందడుగు జాతీయం:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పశ్చిమబెంగాల్ కోల్‌కతా వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అదో భయానక ఘటన అని తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇటువంటి నేరాలపై యావత్ దేశం ఆగ్రహానికి గురవుతోందని, అందులో తాను కూడా ఉన్నానన్నారు. ఇప్పటివరకు జరిగింది చాలని.. మహిళలపై జరిగే నేరాలపై యావత్ దేశం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇలాంటి



అఘాయిత్యాలను ఏ నాగరిక సమాజం అనుమతించదన్నారు. పీటీఐ వార్తా సంస్థకు రాసిన ప్రత్యేక వ్యాసంలో బెంగాల్ ఘటనపై తొలిసారి స్పందించిన ద్రౌపదీ ముర్ము.. దేశంలో పలుచోట్ల మహిళలపై జరుగుతోన్న నేరాలపై ఆందోళన వ్యక్తం చేశారు.



## వైద్యుల భద్రతపై రాష్ట్రాలకు లేఖ

### నోటీసులు అంటించండి పెట్రోలింగ్ పెట్టండి

సుప్రీంకోర్టు కీలక సూచనలు

02

ముందడుగు
గురువారం,
29-08-2024,
హైదరాబాద్



# వైద్యుల భద్రతపై రాష్ట్రాలకు లేఖ

## నోటీసులు అంటించండి.. పెట్రోలింగ్ పెట్టండి

### సుప్రీంకోర్టు కీలక సూచనలు

ముందడుగు జాతీయం:

పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా పెను దుమారం కొనసాగుతోంది. ఓ వైపు దీనిపై ఆందోళనలు జరుగుతుండగానే ఉత్తరాఖండ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వైద్యులు, నర్సులపై అఘాయిత్యాలు, దాడుల వంటి ఘటనలు చోటుచేసుకోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఈ క్రమంలోనే వైద్యుల భద్రతకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు కీలక సూచనలు చేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసింది. పని ప్రదేశంలో వైద్యారోగ్య సిబ్బందికి భద్రత నిమిత్తం అవసరమైన చర్యలను సూచించింది. ఈ మేరకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర బుధవారం లేఖ రాశారు.

### కేంద్రం చేసిన సూచనలివే..

- వైద్యారోగ్య సిబ్బంది రక్షణ కోసం ఉన్న చట్టాలు, వారిపై దాడులకు పాల్పడితే బాధ్యులకు విధించే శిక్షలకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి ప్రాంగణంలో స్పష్టంగా ప్రదర్శించాలి. ఇంగ్లీష్‌తో పాటు స్థానిక భాషల్లో ఈ నోటీసులు ఉండాలి.
- ఆసుపత్రుల్లో హింసాత్మక ఘటనల నియంత్రణ, వైద్యుల భద్రత కోసం అమలు చేయాల్సిన వ్యూహాల కోసం సీనియర్ వైద్యులు, పాలనాధికారులతో కమిటీలను ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల్లోని కీలక ప్రదేశాల్లోకి సాధారణ ప్రజలు, రోగుల బంధువుల కదలికలపై నియంత్రణ ఉండాలి. విజిటర్ పాస్ పాలసీని కఠినంగా అమలు చేయాలి.
- రాత్రి విధుల సమయంలో క్యాంపస్‌లోని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి రెసిడెంట్ డాక్టర్లు, నర్సులు సురక్షితంగా వెళ్లేలా సదుపాయాలు కల్పించాలి. రాత్రివేళల్లో ఆసుపత్రి క్యాంపస్‌లోని అన్ని భవనాలు, హాస్టళ్లలో తగిన వెలుతురు ఉండేలా చూడాలి. రాత్రి విధుల సమయంలో హాస్పిటల్ క్యాంపస్‌లో రొటీన్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి.
- ఆసుపత్రిని స్థానిక పోలీసు స్టేషన్‌కు అనుసంధానం చేయాలి. లైంగిక వేధింపులపై విచారణ కోసం అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌లోని ప్రతి మూలా సీసీటీవీ కెమెరాలు పనిచేసేలా చూస్తూ వాటిని నిరంతరం పర్యవేక్షించాలి.

# విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం

## నా కుటుంబం కబ్జా చేసినట్లు చూపిస్తే కూల్చివేయిస్తా

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం

ముందడుగు హైదరాబాద్:

అక్రమ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సీడబ్ల్యూసీ సభ్యుడు పల్లంరాజు నిర్మాణాన్నే హైడ్రా మొదట కూల్చివేసింది. జన్వాడ ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో కేటీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారు.. సర్పంచ్‌లు కాదని పదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు తెలియదా?నా కుటుంబం కబ్జా చేసినట్లు కేటీఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తా. విద్యా సంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోం.



హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే ఇప్పటివరకు పరిమితం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకే మొదటి ప్రాధాన్యం. 30 ఏళ్ల కింద కట్టిన అక్రమ నివాస కట్టడాలైనా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. భారాస నేత హరీశ్‌రావు సిద్ధమైతే ఆయన నేతృత్వంలోనే చెరువుల ఆక్రమణలపై నిజ నిర్ధరణ కమిటీ వేస్తాం. హైడ్రా కూల్చివేతలపై ఒత్తిళ్లు వస్తున్నాయి.. అయినా ఎదుర్కొంటాం.. వెనక్కి తగ్గేది లేదు" అని సీఎం వ్యాఖ్యానించారు.

# యుద్ధాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

ముందడుగు జాతీయం:

మనదేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు.



"యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్‌లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి" అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబులెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్‌లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు వేగంగా స్పందించడంతోపాటు.. కట్టర్ల వంటి అధునాతన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

ముందడుగు
గురువారం,
29-08-2024,
హైదరాబాద్

# రాంనగర్‌లో అక్రమ నిర్మాణాలు పరిశీలించిన రంగనాథ్



ముందడుగు హైదరాబాద్:
హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించారు. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదుమేరకు అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మణెమ్మ గల్లీలో రోడ్డు ఇరుకుగా మారిందని, నాలా.. రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు మొరపెట్టుకున్నారు.

నాలా ఆక్రమణ, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, సబంధిత స్థల పత్రాలను పరిశీలించాలని జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

# భారత పౌరసత్వం తీసుకున్న పాకిస్తానీ

## గోవా సీఎం చేతుల మీదుగా అందజేత

ముందడుగు గోవా:
గోవాలో నివసిస్తున్న 78 ఏళ్ల జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరీరాకు భారత పౌరసత్వం లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా పెరీరా ఈ ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోహన్ అశోక్ ఖౌంటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ.. పెరీరా గోవాకు చెందినవారైనా పాక్‌లో ఉండటంతో పౌరసత్వం విషయంలో ఇబ్బందులు పడినట్టు చెప్పారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ చట్టం-2019 ప్రకారం పెరీరాకు పౌరసత్వం లభించిందన్నారు. గోవా నుంచి పౌరసత్వం అందుకున్న మొదటి వ్యక్తి పెరిరా అని సావంత్ పేర్కొన్నారు. ఇంకా చాలా మంది సీఏఏకు అర్హులైన వారు గోవాలో ఉన్నారని, వారు ఎవరైనా ప్రభుత్వాన్ని సంప్రదించవచ్చని వివరించారు. ఇప్పటికే దేశంలో అనేక మంది సీఏఏ చట్టాన్ని వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు.



గోవాకు చెందిన జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరిరా స్వాతంత్ర్యానికి ముందు ఉన్నత చదువుల కోసం పాకిస్థాన్‌కు వెళ్లారు. అనంతరం అక్కడ ఉద్యోగంలో చేరారు. స్వాతంత్ర్యం అనంతరం ఆయన పాకిస్థాన్‌లోనే ఉండిపోవడంతో ఆయనకు అక్కడి పౌరసత్వం లభించింది. 1946లో గోవాకు చెందిన మహిళను పెళ్లి చేసుకున్నారు. 2013లో ఉద్యోగ విరమణ తర్వాత భారత్‌కు తిరిగొచ్చారు.

# సైబర్ నేరగాళ్ల కోసం బ్యాంకు ఖాతాలు

## ఎస్‌బీఐ మాజీ మేనేజర్ అరెస్ట్



ముందడుగు హైదరాబాద్:
సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. ప్రతి అవకాశాన్ని వాడుకుంటూ అందినంత దండుకుంటున్నారు. అలాంటిది సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చిన కేసులో సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. షంషేర్‌గంజ్ ఎస్‌బీఐ మాజీ మేనేజర్ మధుబాబు, సందీప్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షంషేర్‌గంజ్ ఎస్‌బీఐకి చెందిన ఆరు ఖాతాల నుంచి రెండు నెలల్లో రూ.175 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. బ్రాంచ్ మేనేజర్ మధుబాబు ఆరుగురు క్యాబ్, ఆటో డ్రైవర్లకు కరెంట్ అకౌంట్లు తెరిచినట్లు పోలీసులు తెలిపారు. మహ్మద్ షోయబ్ అనే వ్యక్తి ఖాతాలు తెరిపించి ఖాతాదారులకు రూ.20 నుంచి రూ.30వేల వరకు, మధుబాబుకు కమీషన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కేసులోనే రెండ్రోజుల కిందట మహ్మద్ షోయబ్, అహ్మద్ బవజీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# యూపీఎస్సీకి అనర్హత వేటువేసే అధికారం లేదు

## తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదు

## ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ పూజా ఖేడ్కర్

ముందడుగు జాతీయం:
ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్ కేసు ఢిల్లీ హైకోర్టు పరిధిలో ఉంది. కోర్టు విచారణలో యూపీఎస్సీ చేసిన వాదనలను పూజ తోసిపుచ్చారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యూపీఎస్సీకి తనపై అనర్హత వేటువేసే అధికారం లేదని వాదించారు. "డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌కు మాత్రమే అఖిల భారత సర్వీసుల చట్టం కింద చర్యలు తీసుకునే వీలు ఉంది" అని ఆమె తన వాదన వినిపించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ.. ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ



అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలపై సమాధానం ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. దాంతో ఆమెకు ఆగస్టు 29 వరకు రక్షణ లభించింది. ఈ క్రమంలో తాజాగా విచారణ జరిగింది.

# అట్లీ సినిమా కన్‌ఫర్మ్!

అల్లు అర్జున్ తాజా చిత్రం 'పుష్ప-2' డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలునెలకొన్నివున్నాయి. ఈ సినిమా తర్వాత బన్నీ చేయబోయే చిత్రం గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తమిళ అగ్ర దర్శకుడు అట్లీతో అల్లు అర్జున్ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారని గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. అగ్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమాను తెరకెక్కించనుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా అధికారిక ప్రకటనకు రంగం సిద్ధమైందని తెలిసింది. మరో వారం రోజుల్లో నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. 'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు అగ్ర హీరో అల్లు అర్జున్. ఇక 'జవాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నాడు తమిళ దర్శకుడు అట్లీ. మరి వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే అభిమానులకు ఇక పండగే అనుకోవచ్చు.

ముందడుగు
గురువారం,
29-08-2024,
హైదరాబాద్

# ఏ లాయర్ వాదించొద్దని విద్యార్థుల నిరసన

## కోల్‌కతా నిందితుడి తరపున ఎవరూ వాదించొద్దని నిరసన

### చర్చనీయాంశంగా మారిన కోల్‌కతా కేసు




ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో గల ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కోర్టులో నిందితుడి తరపున వాదించేందుకు ఏ న్యాయవాది ముందుకు రాలేదు. ఇలాంటి పరిణామాల నడుమ ఓ మహిళా న్యాయవాది కవితా సర్కార్ నిందితుడి తరపున వాదనలు వినిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. కేసు ఎంతటి తీవ్రమైనదైనా సరే.. పారదర్శక విచారణ కోసం నిందితుడి వాదనలు వినడం కూడా ముఖ్యమే. దీన్ని పరిగణనలోకి తీసుకునే ఇటీవల కోర్టు లీగల్ ఎయిడ్‌కు సిఫార్సులు చేసింది. దీంతో సంజయ్ రాయ్ కోసం వాదించే బాధ్యతలను కోల్‌కతాకు చెందిన మహిళా న్యాయవాది కవితా సర్కార్‌కు అప్పగించారు. దీంతో ఆమె పేరు ఇప్పుడు వార్తల్లో నిలిచింది.

52 ఏళ్ల కవిత లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో సభ్యురాలు. సాధారణంగా కేసు విచారణ కోసం ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్నవారి కోసం.. లేదా వాదించేందుకు ఏ లాయర్ ముందుకు రాని పరిస్థితుల్లో ఈ కౌన్సిల్ వారికి న్యాయపరమైన సాయం చేస్తుంటుంది. అలా.. సంజయ్ రాయ్ కేసు కవిత చేతికొచ్చింది. హూగ్లీ మోహసిన్ కాలేజీ నుంచి న్యాయవిద్యను పూర్తి చేసిన కవిత.. అలిపోర్ కోర్టులో తన కెరీర్‌ను ప్రారంభించారు. గతేడాది జూన్‌లోనే సెల్డా కోర్టుకు బదిలీ అయ్యారు. న్యాయవృత్తిలో 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న ఆమె తొలుత ఎక్కువగా సివిల్ కేసులనే వాదించారు. గతేడాది ఫిబ్రవరిలో క్రిమినల్ లాయర్‌గా స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో చేరారు.

# టీచ్ ఫర్ ఇండియా 2025 ఫెలోషిప్

## 2025 టీచ్ ఫర్ ఇండియా ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 1 సెప్టెంబరు 2024

ముందడుగు హైదరాబాద్:

లాభాపేక్ష లేని ఎడ్యుకేషనల్ ఈక్విటీ టీచ్ ఫర్ ఇండియా, తన 2025 ఫెలోషిప్ కోసం దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. ఒక ఫెలోగా, వారు విద్యార్థుల భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తూ, భవిష్యత్ నాయకులను ప్రేమతో నడిపిస్తారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ సెప్టెంబరు 1, 2024. టీచ్ ఫర్ ఇండియా ఫెలోషిప్ అనేది రెండేళ్ల, పూర్తి-సమయం చెల్లింపు ఫెలోషిప్ ప్రోగ్రామ్. ఇది 500 కన్నా ఎక్కువ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, 300 కంపెనీలు తదితర విభిన్న నేపథ్యాల నుంచి, వయస్సు



గ్రూపులకు చెందిన సభ్యులను ఒకే పైకప్పు క్రిందకు తీసుకువస్తుంది. ఫెలోషిప్ దరఖాస్తు ప్రక్రియ చాలా కఠినంగా ఉంటుంది. భారతదేశంలోని తెలివైన, అత్యంత ఆశాజనకమైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది.

# 9 లక్షల మంది బయోమెట్రిక్ అన్‌బ్లాక్

## ఉడాయ్‌ని ఆదేశించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ


ముందడుగు జాతీయం:

అస్సాం రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ఆధార్ నమోదు విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రానికి చెందిన 9,35,682 మంది పౌరుల బయోమెట్రిక్ వివరాలను అన్‌బ్లాక్ చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఉడాయ్‌ని ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం బుధవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ పౌర నమోదు అప్‌డేషన్ ప్రక్రియలో భాగంగా 2019 ఫిబ్రవరి-ఆగస్టు మధ్యలో ఈ 9.35లక్షల మంది బయోమెట్రిక్ వివరాలను ఉడాయ్ లాక్ చేసింది. ఆధార్ కార్డు జారీకి వీరు అర్హులేనా కాదా? అనేది తెలుసుకునేందుకు అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, వీరి వివరాలను అన్‌బ్లాక్ చేయాలని గత కొంతకాలంగా అస్సాం ప్రభుత్వం, సీఎం హిమంత బిశ్వ శర్మ కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ క్రమంలోనే



ఇటీవల సొలిసిటర్ జనరల్ ఈ అంశాన్ని అధ్యయనం చేసి న్యాయశాఖకు పలు సూచనలు చేశారు. వీరికి ఆధార్ కార్డు జారీలో ఎలాంటి చట్టపరమైన అడ్డంకి లేదని ఎస్‌జీ గుర్తించారు. ఆ సూచనల మేరకు వారి బయోమెట్రిక్ వివరాలను వెంటనే అన్‌బ్లాక్ చేయాలని ఉడాయ్‌కి సూచించినట్లు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా తమ ఉత్తర్వులో వెల్లడించింది. "ఆధార్ చట్టం ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని బాధిత అస్సాం పౌరులకు విశిష్ట ప్రాధికార గుర్తింపు కార్డులు జారీ చేయాలి" అని పేర్కొంది. తాజా నిర్ణయంపై అస్సాం ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది.

# "ఫోన్‌పే PG బోల్ట్"ను ఆవిష్కరించిన ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే





ముందడుగు హైదరాబాద్:

మర్చంట్లకు మరింత ప్రోత్సాహం అందించేలా ఫోన్ పే పిజి బోల్ట్ ను ఆవిష్కరిస్తున్నామని ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే ఈరోజు ప్రకటించింది. ఇది 99% విజయాల రేటుతో కస్టమర్లకు అత్యంత వేగవంతమైన పేమెంట్ అనుభవాన్ని అందిస్తుందని తెలిపింది. అనేక యాప్‌లలో ఆన్‌బోర్డింగ్ చేయాల్సిన అవసరం లేకుండానే అన్ని యాప్‌లలోనూ తమ పేమెంట్లను సంధానించుకోగల రిజిస్టర్డ్ ఫోన్‌పే మర్చంట్లు, వినియోగదారులందరూ ఒక్క సెకనులోనే లావాదేవీని పూర్తి చేయగల సౌకర్యాన్ని ఫోన్‌పే పిజీ బోల్ట్ అందిస్తుంది. ఫోన్‌పే పిజి బోల్ట్ అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుండడం మార్కెట్ లోని ఇతర పేమెంట్ సొల్యూషన్లకన్నా దీనిని భిన్నంగా ఉంచుతోంది. "వ్యాపారాలను శక్తివంతం చేసి, వినియోగదారులకు పేమెంట్ అనుభవాన్ని మొత్తంగా మెరుగుపరచాలనే మా ఆశయంలో కీలక మైలు రాయిగా నిలిచే ఫోన్‌పే PG బోల్ట్ ను ప్రారంభించడం మాకెంతో ఆనందంగా ఉంది" అని ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే & ఆన్ లైన్ మర్చంట్ల విభాగం హెడ్ అంకిత్ గౌర్ అన్నారు.

# బంగ్లాదేశ్ మహిళా జర్నలిస్టు అనుమానాస్పద మృతి

## ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో దర్యాప్తు



ముందడుగు బంగ్లాదేశ్:

బంగ్లాదేశ్‌లోని గాజీ(బెంగాలీ) టీవీ ఛానల్‌కు చెందిన జర్నలిస్టు రహ్మనా సారా మృతదేహం సరస్సులో లభ్యమైంది. మృతదేహాన్ని ఢాకా మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. అయితే ఆమెది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. సారా ఆఫీసుకు వెళ్లిన తర్వాత ఇంటికి తిరిగి రాలేదని ఆమె భర్త తెలిపారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆమె సరస్సులో దూకినట్లు సమాచారం అందిందని వెల్లడించారు.

తన మరణానికి ముందు మంగళవారం రాత్రి సారా తన ఫేస్‌బుక్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. అందులో "నీలాంటి స్నేహితుడు ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. దేవుడు నిన్ను ఎప్పటికీ చల్లగా చూస్తాడు. త్వరలో నువ్వు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటావని ఆశిస్తున్నాను. మనం మన జీవితం కోసం ఎన్నో పథకాలు వేసుకున్నాం. కానీ వాటిని నెరవేర్చలేకపోతున్నందుకు నన్ను క్షమించు" అంటూ రాసుకొచ్చారు. మరో పోస్ట్‌లో "చావుతో సమానమైన జీవితాన్ని గడపడం కంటే మరణించడం ఉత్తమం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

ముందడుగు
గురువారం, 29-08-2024, హైదరాబాద్

# మొదటి ఇంటెలిజెంట్ క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ఎంజి విండ్సర్



ముందడుగు హైదరాబాద్:
తమ రాబోతున్న వాహనం, ఎంజి విండ్సర్- భారతదేశపు మొదటి ఇంటెలిజెంట్ క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ కోసం కొత్త టీజర్ ను విడుదల చేసిన జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా. వీడియో వాహనం యొక్క ప్రభావితపరిచే 15.6 అంగుళాల 'గ్రాండ్ వ్యూ టచ్ డిస్ ప్లే' ని ప్రదర్శించింది, ఇది శ్రేణిలోనే కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది.
విస్తారమైన స్క్రీన్ సైజ్ కారులో ఉన్న వారు శ్రమ లేకుండా ప్రయాణించడానికి, వినోదాన్ని నియంత్రించడానికి, మరియు వాహనం సెట్టింగ్స్ ను సులభంగా సర్దుబాటు చేయడానికి అనుమతి ఇస్తుంది. వాహం కదలకండా ఒక చోట ఆగినప్పుడు వాహనాన్ని వినోదం, గేమింగ్ మరియు నేర్చుకోవడానికి వేదికగా వాహనాన్ని మార్చే ఇన్-కార్ అనుభవాన్ని పునర్నిర్వచించడానికి ఎండి విండ్సర్ లోని 5.6-అంగుళాల టచ్ స్క్రీన్ రూపొందించబడింది.
15.6 అంగుళాల 'గ్రాండ్ వ్యూ టచ్ డిస్ ప్లే' కేబిన్ పూర్తి అందాన్ని మెరుగుపరుస్తూనే విలాసాన్ని చేర్చింది. ప్రతి ప్రయాణాన్ని మరింత ఆనందకరంగా చేసింది. ఇది విండ్సర్ యొక్క ఆధునిక డిజైన్ ను పరిపూర్ణంగా పూరకం చేసింది, భారతదేశపు వినియోగదారులకు ప్రీమియమ్ నెస్, స్టైల్ మరియు సౌకర్యాల యొక్క ఆదర్శవంతమైన మిశ్రమాన్ని అందిస్తోంది.

# ఆలోచింపజేసే కథతో షార్ట్ ఫిల్మ్

## పూజా కార్యక్రమాన్ని ప్రారంభించిన రాజేంద్ర పల్నాటి




ముందడుగు హైదరాబాద్:
సమాజంలో నిత్యం ఎన్నో చిత్రాలు వస్తుంటాయని, కాని సమాజంలో జరుగుతున్న దురాగతాలపై ప్రజల్లో అవగాహన కల్పించే షార్ట్ ఫిల్మ్ నిర్మించడం గొప్ప పరిణామమని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి అన్నారు. బుధవారం సోమాజిగూడలోని షార్ట్ ఫిల్మ్ పూజ ప్రారంభించారు. సమాజంలోని జరిగే అఘాయిత్యాలపై ఈ షార్ట్ ఫిల్మ్ ఉండబోతుందని దర్శకుడు శివనాగరాజు తెలిపారు. ఒక మహిళ వైద్యురాలికి, ఉన్మాదులకు మధ్య జరిగే సన్నివేశాలే ఇందులో ఉండబోతున్నాయన్నారు. ఈ సినిమాను రమేష్‌బాబు కోమటి నిర్మిస్తున్నారు. ఈ నూతన షార్ట్ ఫిల్మ్ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ బృందం దేవేందర్ కొన్నె, ప్రదీప్ రెడ్డి, బత్తిని రాజేష్, హిరోయిన్ హేమ పెదకోట, ఎడిటర్ కేతన్ కంచర్ల, కెమెరామెన్ నవీన్ కుమార్ పొన్నాల, కలరింగ్ రామోజు మణికంఠ, అసిస్టెంట్ డైరెక్టర్ జాఫర్ వలీ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

# మర్చంట్లకు ఇన్-యాప్ పేమెంట్లలో సరికొత్త సంచలనం



ముందడుగు హైదరాబాద్:
మర్చంట్లకు మరింత ప్రోత్సాహం అందించేలా ఫోన్ పే పిజి బోల్ట్ ను ఆవిష్కరిస్తున్నామని ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే బుధవారం ప్రకటించింది. ఇది 99% విజయాల రేటుతో కస్టమర్లకు అత్యంత వేగవంతమైన పేమెంట్ అనుభవాన్ని అందిస్తుందని తెలిపింది. అనేక యాప్‌లలో ఆన్‌బోర్డింగ్ చేయాల్సిన అవసరం లేకుండానే అన్ని యాప్‌లలోనూ తమ పేమెంట్లను సంధానించుకోగల రిజిస్టర్డ్ ఫోన్‌పే మర్చంట్లు, వినియోగదారులందరూ ఒక్క సెకనులోనే లావాదేవీని పూర్తి చేయగల సౌకర్యాన్ని ఫోన్‌పే పిజి బోల్ట్ అందిస్తుంది. ఫోన్‌పే పిజి బోల్ట్‌ను సంధానించుకోవడం ద్వారా మర్చంట్లు కస్టమర్ సంతృప్తి, విక్రయాలను పెంచుకోవడం లాంటి అంశాల్లో పనితీరును గణనీయంగా మెరుగుపరచుకుని, మార్కెట్‌లో పోటీపరంగా ముందు నిలబెడుతాయి. .
"వ్యాపారాలను శక్తివంతం చేసి, వినియోగదారులకు పేమెంట్ అనుభవాన్ని మొత్తంగా మెరుగుపరచాలనే మా ఆశయంలో కీలక మైలు రాయిగా నిలిచే ఫోన్‌పే PG బోల్ట్ ను ప్రారంభించడం మాకెంతో ఆనందంగా ఉంది" అని ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే & ఆన్ లైన్ మర్చంట్ల విభాగం హెడ్ అంకిత్ గౌర్ అన్నారు.




# మరో 100 రోజుల్లో పుష్ప ది రూల్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్‌కు క్రేజీ అప్‌డేట్ వచ్చింది. మరో 100 రోజుల్లో 'పుష్ప ది రూల్' కౌంట్‌డౌన్ షురూ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2'. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 06న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక 'పుష్ప 2' విడుదలకు ఇంకా 100 రోజులు మాత్రమే ఉన్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. ఇక క్లైమాక్స్ అనంతరం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ చేయబోతున్నట్లు తెలిపింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ మూవీని నిర్మిస్తోంది.